క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం 20వ వార్డులోని చినవాల్తేరు రజకవీధి సామాజిక భవనంలో సాగరతీర కలంజియా సమాఖ్య, ధన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అధికంగా మహిళలకే అందిస్తున్నారన్నారు. మహిళలు ఆలోచించి మంచి వారిని వచ్చే ఎన్నికల్లో ఎన్నుకోవాలని కోరారు. సమాఖ్య సమన్వయకర్త ధనలక్ష్మి, 20వ వార్డు కార్పొరేటర్ ముర్వ్వల లక్ష్మి, జేసీఐ ప్రతినిధి హెన్నా, న్యాయవాది అరుణ, వార్డ్ సీవో ఇందిర, రత్న, సమాఖ్య నాయకులు దివ్య, పాపమ్మ, సత్య, గోవిందా లక్ష్మి, పుష్ప, పూర్ణ, దాదాపు 150 కలంజియా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏవో నారాయణరావుకు అభినందనలు



నారాయణరావును అభినందిస్తున్న జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు

మహారాణిపేట: ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోష) పరిపాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావును గురువారం పలువురు అభినందించారు. జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ఎన్‌జీవో సంఘం సిటీ అధ్యక్షుడు వీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు నారాయణరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిశోధకురాలికి అభినందన



సరోజినిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం పరిశోధకురాలు డాక్టర్ వి.సరోజినికి కబీర్ కోహినూర్ సమ్మాన్ 2024 పురస్కారం లభించింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని సద్గురు ఆశ్రమం అందించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో సరోజినిని అభినందించారు.

- హిందీ విభాగంలో జేఆర్ఎఫ్ సాధించిన షేక్ మనల్లా హుస్సేన్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఆర్ఎఫ్ సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఎఫ్‌సీఐ అభివృద్ధికి చర్యలు



ఎఫ్‌సీఐలో వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ సమీపంలోని ప్రభుత్వం ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం బోర్డు ఆఫ్ గవర్నింగ్ మీటింగ్ జరిగింది. అమరావతి నుంచి ఏపీ సాంకేతిక విద్యా సంచాలకురాలు సి.నాగరాణి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఎఫ్‌సీఐలో జరుగుతున్న శిక్షణల గురించి ప్రిన్సిపాల్ వెంకటరమణ వివరించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో ఏపీ సాంకేతిక విద్యా సంచాలకురాలు సి.నాగరాణి తెలియజేశారు. ఏపీ రాష్ట్ర సాంకేతిక, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, గేట్‌వే హోటల్, ఎలిగెంట్ హోటల్ మేనేజర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

- నాలుగేళ్లలో హాస్టళ్ల సంఖ్య పెంపుదల
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం

రేపటికి ముందడుగు

ఏయూ క్యాంపస్: మహిళా విద్య, సాధికారతకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. ముందుగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా ఆరు హాస్టళ్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. విభాగాలు, హాస్టళ్లలో రెస్ట్ రూమ్‌లను పూర్తిగా ఆధునికీకరించామన్నారు. ఏయూ పాలక మండలిలో సైతం అధిక శాతం మంది మహిళలకు స్థానం కల్పించామన్నారు. వారి విలువైన సూచనలు, సహకారంతో వర్సిటీని అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళలకు అత్యంత ప్రాముఖ్యత, గుర్తింపును ఇచ్చి ప్రోత్సహిస్తున్న విధానం, పదవుల్లో సైతం వారికి 50 శాతానికి పైగా కేటాయించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి విద్యార్థి తన జీవితాన్ని మలుచుకునే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నెగిటివ్ ఆలోచనలను దరిచేరనివ్వకుండా సానుకూల దృక్పథంతో సాగాలని సూచించారు.



మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

మనుషుల మధ్య వారధులు నిర్మించాలని, అడ్డుగోడలు నిర్మించుకోవద్దని హితవు పలికారు.

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ మహిళలు లేని సమాజాన్ని ఊహించడం సాధ్యపడదన్నారు. థామస్ ఆల్వా ఎడిసన్‌ని ఆయన తల్లి తీర్చిదిద్దిన విధానం విద్యార్థులకు వివరించారు. మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య ఎ.పల్లవి నాలుగు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సలహాదారు శ్రీదేవి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ పి.ఉష రచించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వేదికపై బహుమతులు ప్రదానం చేశారు. వర్సిటీలో పని చేస్తున్న పలువురు మహిళా సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

జన శిక్షణ సంస్థాన్‌లో..

మద్దిలపాలెం : స్థానిక జన శిక్షణ సంస్థాన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల ప్రతినిధి రహీం మున్నీషా బేగం, జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించి బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు, ఇన్‌కామ్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ వి.అపర్ణ ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా కళాశాల మహిళా అధ్యాపకులను సత్కరించారు.

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జాలరిపేటలో మేజిక్ బస్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ చినవాల్తేర్ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రమ్య, స్వాంతన ఫౌండేషన్ డైరెక్టర్ పనిగ్రేసి, పోలీసు కానిస్టేబుల్ రేవతి, మ్యాజిక్ బస్ ఎన్జీఓ ట్రెనింగ్స్ మానిటరింగ్ ఆఫీసర్ నరేంద్ర, శంకర్, పైడి, తదితరులు పాల్గొన్నారు.

- క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజివ్ పేరిట వాల్తేర్ క్లబ్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. అంధ యువత కావ్య పూర్ణిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె ఆర్కిటెక్ట్‌గా రాణిస్తున్న విధానాన్ని వివరించారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ గీతా శ్రీకాంత్, క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జన శిక్షణ సంస్థాన్‌లో మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ మాధవి



మహిళా దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, తదితరులు



మహిళా దినోత్సవంలో పాల్గొన్న క్రెడాయ్ ప్రతినిధులు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు



శాస్త్రీయ నృత్యం

- ఇగ్నో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కేజీహెచ్‌లోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోనిపాటి ధర్మారావు పాల్గొని పలువురు మహిళలను సత్కరించారు.

రైల్వే ప్రగతిలో మహిళల పాత్ర ప్రశంసనీయం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారంతో ఘనంగా ముగిశాయి. రైల్‌క్లబ్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ వాల్తేర్ డివిజన్ ప్రగతిలో మహిళల పాత్ర ఎంతో ప్రశంసనీయమంటూ వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు రైల్వేకు మాత్రమే కాదని, దేశానికి ఆణిముత్యాలని కొనియాడారు. వాల్తేర్ డివిజన్‌లో లోకో పైలట్స్‌గా, ట్రాక్ మెయింటనర్స్‌గా, ట్రెన్ మేనేజర్స్‌గా, సిగ్నల్, టెలికం, ఆరోగ్య కేంద్రాల్లో, రైల్వే భద్రతా దళంలో విధులు నిర్వర్తిస్తున్న నారీశక్తిని అభినందించారు.

ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పురుషులతో పోటీ పడి అన్ని రంగాలు, విభాగాల్లో నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తున్నారరని ప్రశంసించారు.



మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

రైల్వేలో తమ తమ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన 43 మంది మహిళా ఉద్యోగులను ఈకార్వో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఓమెగా హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ నిత్య, డాక్టర్ పి.వేంకటేశ్వరరావు మహిళల్లో వచ్చే బలహీనతలు, సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ అంకిత శర్మ, కార్యవర్గ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనరంజకంగా సీఎం వైఎస్ జగన్ పాలన

మద్దిలపాలెం: సంక్షేమమే ధ్యేయంగా జనరంజకమైన పాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం పదిలం చేసుకోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో గురువారం 54వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావులతో కలిసి పాదయాత్ర చేశారు. హెచ్‌బీ కాలనీ, రజక వీధి ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మూడు సార్లు వరుసగా గెలిచిన ఎమ్మెల్యే వెలగపూడి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఈ ఐదేళ్లలో వార్డులో చాలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



16వ వార్డులో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

పారదర్శకంగా ఎన్నికల విధులు

మహారాణిపేట: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టరు కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ అధ్యక్షతన విశాఖ తూర్పు శాసనసభ నియోజకవర్గం ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాబోయే 45 రోజుల పాటు కష్టపడి పని చేయాలన్నారు. విశాఖ తూర్పు శాసనసభ నియోజకవర్గంలో 282 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, సుమారు 2000 మంది సిబ్బందిని వినియోగించనున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. రూమర్లు, ఫేక్ న్యూస్‌లకు అవకాశం ఇవ్వకుండా ప్రతి రిపోర్ట్ సకాలంలో కచ్చితత్వంతో తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా ట్రెనింగ్ మేనేజ్‌మెంట్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా ఏర్పాటు, ఈవీఎం మేనేజ్‌మెంట్, ఎన్నికల సామగ్రి తరలింపు, వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం అధికారులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

వృద్ధుల సంక్షేమం ప్రధానం

ఏయూ క్యాంపస్: మారుతున్న సమాజంలో వృద్ధుల సంక్షేమం ప్రధానమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో హెరిటేజ్ ఫౌండేషన్ రీజినల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్, ఏయూ సోషల్ వర్క్ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న వృద్ధులు, వారి సమస్యలపై సలహాలు మూడు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ డిఫెన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధుల ఆరోగ్యం, అవసరాలు, సంక్షేమం అంశాలపై చర్చించడం ఎంతో అవసరమన్నారు. వృద్ధాప్యంలో వారు సంతోషంగా జీవనం సాగించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడుతూ వృద్ధుల ఆరోగ్య, మానసిక సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ వర్క్ విభాగం ఆచార్యులు టి.శోభశ్రీ, ఏజ్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్.ఎస్.రాజు, ఏయూ ఆచార్యులు కె.విశ్వేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

అప్పు తీర్చమన్నందుకు కత్తితో దాడి

బీచ్ రోడ్డు: అప్పు విషయంలో తలెత్తిన ఘర్షణలో ఓ యువకుడు చంపుతానంటూ కత్తితో బెదిరించడంపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రశేఖర్ అనే యువకుడు తన స్నేహితుడితో కలిసి బైకుపై సిరిపురం వెళ్తుండగా వాల్తేరు పోలమాంబ ఆలయం వద్ద మరో బైకుపై మురాన్ రాము తన స్నేహితుడు పవన్‌తో వచ్చి అడ్డుపడ్డాడు. చంద్రశేఖర్‌ను తిడుతూ రాము తనతో తీసుకువచ్చిన కత్తి చూపిస్తూ చంపుతానంటూ బెదిరించాడు. చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పు విషయంలోనే రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. శ్రీనివాస అనే వ్యక్తి పవన్ వద్ద కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. బుధవారం జరిగిన ఓ వేడుకలో ఉన్న శ్రీనివాసను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని పవన్ భావించాడు. అందుకోసం రాముని తోడు తీసుకొని వేడుకలు జరిగే ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ గొడవ పడడంతో చంద్రశేఖర్ రాముని, పవన్‌ను మందలించి పంపించేశాడు. దీంతో చంద్రశేఖర్‌పై కోపం పెంచుకున్న వారు మార్గం మధ్యలో కాపు కాసి దాడికి ప్రయత్నించారు. చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకోవడంతో రాము, పవన్ పరారయ్యారు.

21 రోజుల రిమాండ్ : ఫిర్యాదు అందుకున్న పోలీసులు పరారీలో ఉన్న రాము, పవన్‌ను అరెస్టు చేశారు. గురువారం కోర్టులో హాజరుపరచగా.. ఇద్దరికీ 21 రోజుల పాటు రిమాండ్ విధించారు. నిందితులను జైలుకు తరలించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



తోటగరువులో జరిగిన సమావేశంలో దివ్యాంగులు

ఆరిలోవ: విశాఖ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం తోటగరువులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ సభ్యుడు మారేడుపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు నుంచి రూ.6 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. శనివారం ఆచార్య నాగార్జున వర్సిటీలో జరగనున్న దివ్యాంగుల మహాగర్జనకు అంతా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఆరిలోవ దివ్యాంగుల సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చినగదిలిలో వైద్య శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలిలో ఎన్టీఆర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు దంత, కంటి పరీక్షలు, బీపీ, మధుమేహం, ఈసీజీ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. చినగదిలి, పెదగదిలి, సంతపాలెం, సూర్యతేజానగర్, తదితర ప్రాంతాల నుంచి మహిళలు, వృద్ధులు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

బీచ్ రోడ్డు: సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పేరుతో సుమారు 100 మంది బధిర విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించారు. సన్‌ఫ్లవర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో బధిరులు రూపొందించిన కళాఖండాలు అబ్బురపరిచాయి. నీటి సంరక్షణ, చారిత్రక కట్టడాలు, గృహోపకరణాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఎం కుమారి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ప్రతిభావంతుల కళాఖండాలు

అటవీ అధికారుల హడావుడి

- జోడుగుళ్లపాలెం నాగక్షేత్రంలో శివరాత్రి ఏర్పాట్ల అడ్డగింత
- ఆలయ నిర్వాహకులతో వాగ్వాదం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలోని నాగక్షేత్రంలో గురువారం రాత్రి అటవీ శాఖ అధికారులు హడావుడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఆలయంలో రెండు రోజులుగా నిర్వాహకులు యోగి ప్రభాకర్‌జీ శివరాత్రి ఏర్పాట్లు చేస్తున్నారు. అటవీ శాఖకు చెందిన స్థలంలో శివలింగం ఏర్పాటు చేశారని, అందులో పక్కా నిర్మాణాలు చేపడుతున్నారంటూ అధికారులు శివరాత్రి పూజల ఏర్పాట్లను అడ్డుకున్నారు. దీంతో నిర్వాహకులు అటవీ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొన్నేళ్లుగా నాగక్షేత్రం పేరుతో శివాలయం ఉందని, నిత్యం భక్తులు వచ్చి పూజలు చేస్తున్నారని తెలిపారు. అయినా అధికారులు సిబ్బందితో అక్కడ ఏర్పాట్లను తొలగించడంతో యోగి ప్రభాకర్‌జీ హిందూ దేవాలయంపై అధికారులు కక్ష సాధిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శివాలయంలో ఏర్పాట్లను అడ్డుకుంటున్న అటవీ శాఖ అధికారులు

శివ పూజకు శైవ క్షేత్రాలు ముస్తాబు

ఏయూ క్యాంపస్: శివ పూజకు శైవ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కిర్లంపూడిలోని శ్రీలలితా సుందరేశ్వర పీఠంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడానికి పురోహితులు ఏర్పాట్లు చేశారు. రుద్రాభిషేకాలు, ఏకవార అభిషేకాలు ఆలయంలో నిర్వహించనున్నారు. ఈస్ట్ షిర్డీ ఆలయంలోని శివాలయంలో శివరాత్రికి పక్కా ఏర్పాట్లు చేశారు. పెదవాల్తేరు అసంగానంద ఆశ్రమంలో వేడుకలు కొనసాగుతున్నాయి. శివరాత్రి రోజున గంగ, గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి ఐదు పుణ్య నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో స్వామికి అభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పంచ నదీ జలాలతో అభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో సహస్ర నామార్చన, రుద్రాభిషేకం చేయనున్నారు.

కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో..

స్థానిక లాసన్స్‌బే కాలనీలో ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిచుకుని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఏకవార అభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేకాలు జరుపుతామన్నారు. అభిషేకాలు చేయించుకునే వారు ఆలయంలో రూ.116 చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ తెలిపారు. సబ్బవరం బంగారుపాలెం గ్రామం సోమ లింగేశ్వరస్వామి ఆలయంలో , పెదగంట్యాడ అప్పికొండ గ్రామం శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో, చింతపల్లి, బొడ్డ గ్రామం శ్రీబొడ్డేశ్వర స్వామి ఆలయంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మృత్యుంజయేశ్వరునికి అభిషేకం చేస్తున్న భక్తుడు

పోలీస్ స్టేషన్‌కు టెన్త్ ప్రశ్నపత్రాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌కు గురువారం పదో తరగతి ప్రశ్నపత్రాలు చేరుకున్నాయి. ఈ పీఎస్ పరిధిలోని మూడు జీవీఎంసీ పాఠశాలలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు వచ్చాయని పోలీసులు తెలిపారు. ప్రత్యేక గదిలో ప్రశ్న పత్రాలను భద్రపరిచినట్లు సీఐ ఎస్.భాస్కరరావు తెలిపారు.